గాలివాన బీభత్సం

- విరిగిన విద్యుత్ స్తంభాలు, కూలిన చెట్లు
- విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్ గ్రామంలో ఆదివారం రాత్రి ఒక్కసారిగా వచ్చిన గాలివాన గ్రామాన్ని అతలాకుతలం చేసింది. పాంనూర్ గ్రామంపై ప్రకృతి కన్నెర్ర చేసినట్లు ఈదురుగాలులలో పలు చెట్లు కూలిపోయి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. బలంగా వీచిన గాలులతో భారీ వృక్షాల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. చెట్ల కొమ్మలు పడటంతో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పెద్ద చెట్టు విరిగిపోయింది. గ్రామశివారులోని శివాయలం వద్ద రావిచెట్టు విరిగి పెద్దకొమ్మ గుడిపై పడింది. గ్రామంలో 50కి పైగా చెట్లు విరగగా 30కి పైగా విద్యుత్ పోల్‌లు విరిగిపోయాయి. చెట్లు రోడ్డుపై పడగా రాత్రి సమయం కావడంతో ఎలాంటి ప్రమాదాలు జరుగలేదు. గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికి రోడ్డుపై నుంచి తొలగించారు. 30 విద్యుత్‌స్తంభాలు విరిగిపోగా గ్రామంలో విద్యుత్ సరఫరా వ్యవస్థ అతలాకుతలమైంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు గ్రామంలో విద్యుత్ సరఫరా లేదు. దాంతో గ్రామస్తులు రాత్రంతా నరక యాతన అనుభవించారు. కాగా, సమాచారం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ శివకుమార్, లైన్‌మన్ కృష్ణంరాజు తదితర విద్యుత్ సిబ్బంది పరిస్థితిని పరిశీలించి పునరుద్ధరణ పనులను చేయించారు. విరిగిన విద్యుత్ పోల్‌లను తొలగించి నూతన విద్యుత్ పోల్‌లను వేయించి లైన్ల మరమ్మతులు చేయించారు. అయితే రోడ్డు పక్కన విద్యుత్ పోల్‌లు, కరెంటు లైన్ల వద్ద చెట్లు భారీగా పెరుగుతున్న గ్రామ పంచాయతీ, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి నెలకొందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా గ్రామంలో పంచాయతీ, విద్యుత్‌శాఖ అధికారుల మధ్య సమన్వయలోపంతో పాటు ముందుచూపు లేకపోవడానికి తోడు ప్రకృతి భీభత్సంతో పాంనూర్ గ్రామస్తులకు తిప్పలు తప్పలేదు.


శివాలయంపై కూలిన రావిచెట్టు


కూలిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్ ఫార్మర్


కొత్త స్తంభం ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది


గాలివానకు ప్రభుత్వ పాఠశాలలో కూలిన చెట్టు

ఇల్లు ధ్వంసం

అకాల వర్షం, ఈదురు గాలులతోమండలంలోని పాంనూర్ గ్రామంలో పొన్న భీమయ్య, దేవిక దంపతలకు చెందిన ఇంటి పైకప్పు లేచిపోవడంతో ఇంటిలో ఉన్న సామగ్రి ధ్వంసమైంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమయ్య, దేవిక వ్యవసాయ కూలీలుగా పనిచేస్తుండగా వారి కుమారుడు డీజే సౌండ్ సిస్టమ్ పని చేస్తాడు. అయితే ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీచడంతో ఇంటికి పైకప్పుగా ఉన్న రేకులు ఒక్కసారిగా ఎగిరి పోయాయి. దాంతో ఇంట్లో ఉన్న వారు తీవ్ర భయాందోళనలతో ఒక మూలన కూర్చున్నారు. గాలితో పాటు వర్షం కురువగా ఇంట్లో ఉన్న వస్తువులు, బియ్యం, డిజే సౌండ్ బాక్స్‌లు, మైక్‌లు, ఆంపిల్‌ఫైర్, టీవీ తదితర వస్తువులన్నీ తడిసి ధ్వంసమయ్యాయి. చూస్తుండగానే వస్తువులన్నీ ధ్వంసమయ్యాయని, దాదాపు రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని వారు రోధిస్తూ తెలిపారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తమ కష్టాన్ని గుర్తించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.


బాధితులు పొన్న భీమయ్య దంపతులు

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

నర్మెట/బచ్చన్నపేట/పాలకుర్తి టౌన్: పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా గెలిచిన పార్టీల నాయకులు నేడు (మంగళవారం) విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదని నర్మెట, బచ్చన్నపేట, పాలకుర్తి ఎస్సైలు కన్నెబోయిన శ్రీకాంత్, కంకాల సతీష్, సాయి ప్రసన్నకుమార్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉందని వివరించారు. ఊరేగింపులు, బాణాసంచా పేల్చడం, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని ప్రకటించారు. రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

చుక్కా రామయ్యను కలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండలం గూడూరు వాసి, ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

చెక్కు అందజేత



బచ్చన్నపేట: మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొండం రమేశ్ గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకుంటే రూ.2 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు పార్టీ అధిష్టానం ప్రకటించిందని, ఇందులో భాగంగానే రమేశ్ కుటుంబానికి చెక్కును అందజేశామని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, వైస్ ఎంపీపీ కల్లూరు అనిల్‌రెడ్డి, వడ్డేపల్లి మల్లారెడ్డి, కానుగంటి బాలచందర్, వడ్డేపల్లి ఉపేందర్‌రెడ్డి, బొమ్మిన సందీప్, జూకంటి కిష్టయ్య, మామిడి ఐలయ్య, భాస్కర్, రాజు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ




టి. వైష్ణవి సాయిచరణ్ యు.వైష్ణవి

చిల్పూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు సోమవారం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో ప్రతిభ చాటి ర్యాంకులు సాధించినట్లు హెచ్ఎం దాసి శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఎంపీసీ విభాగంలో టి. వైష్ణవి 993, ఎంబైపీసీ విభాగంలో 341వ ర్యాంకు, నేరెళ్ల సాయిచరణ్ ఎంపీసీ విభాగంలో 2,358వ ర్యాంకు ఉద్దెమారి వైష్ణవి ఎంబైపీసీలో 2253, ఎంపీసీలో 2,945 ర్యాంకు సాధించారు. అదేవిధంగా శ్రీజ, అర్చన, శిరీష, సాత్వికలు క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల అభివృద్ధి దాత పెద్ది వెంకటనారాయణగౌడ్, ఎంపీపీ సరిత బాలరాజు, ఏఏపీసీ చైర్మన్ రాధిక, మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్, నేరెళ్ల గౌరిశంకర్ శైలజలు అభినందించారు.

366 ర్యాంక్ సాధించిన ఉప్పుగల్లు విద్యార్థి రామ్‌చరణ్


రాంచరణ్

జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు గ్రామానికి చెందిన తాటి రాంచరణ్ పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్షలో 366 ర్యాంకు సాధించాడు. విద్యార్థి తాటి రాంచరణ్ జనగామలోని అరబిందో పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేశాడు. ఇటీవల నిర్వహించిన పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్షలో ప్రతిభను కనబర్చి మెరుగైన ర్యాంకు సాధించడంతో తోటి విద్యార్థులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

పట్టణంలోని..



జిల్లా అనీష్ ఎ.సరిత

జనగామ రూరల్: సోమవారం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాల్లో జనగామ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పట్టణంలోని సాయినగర్‌కు చెందిన ఎక్కలాదేవి చరిత ఎంపీసీ విభాగంలో 321, ఎంబైపీసీలో 3,314 ర్యాంకు సాధించింది. అలాగే పట్టణంలోని అరబిందో హైస్కూల్‌కు చెందిన జిల్లా అనీష్ ఎంపీసీ విభాగంలో 409, ఎంబైపీసీలో 3,713 ర్యాంకు సాధించాడు.

నివాళి



జనగామ రూరల్: బీజేపీ మండల అధ్యక్షుడు లద్దునూరి మహేష్ తల్లి యాదమ్మ అనారోగ్యంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మృతి చెందింది. కాగా, సోమవారం మృతదేహానికి ఎంపీపీ మేకల కళింగ రాజు పూలమాల వేసి నివాళులర్పించారు.

'తెలంగాణలో ఏపీ వార్తలు మినహాయించండి'

రఘునాథపల్లి: తెలంగాణ రేడియో స్టేషన్ల నుంచి ప్రసారమయ్యే ప్రాంతీయ వార్తల్లో ఆంధ్రప్రదేశ్ వార్తలు మినహాయించాలని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ కేసిపెద్ది నరసింహరాజు కోరారు. ఈ మేరకు సోమవారం ఆలిండియా రేడియో హైదరాబాద్ కార్యాలయంలో ఆయన అధికారులకు వినతి పత్రం అందజేశారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

బచ్చన్నపేట: వాస్విక్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మంత్రి సీతక్క అన్నారు. వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే ప్రజాభవన్‌లో ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్‌ను సోమవారం చైర్మన్ నిడిగొండ నరేష్ కుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజాభవన్‌కు విచ్చేసే ప్రజల దాహార్తిని తీర్చమని కోరిన వెంటనే వారు స్పందించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ముందుముందు ప్రజాసేవలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని తన వంతు సహకారం ఎల్లప్పుడూ సంస్థకు ఉంటుందని ఆమె తెలిపారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

జనగామ: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఎంసీహెచ్, అనాథ వృద్ధాశ్రమాల్లో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా అధ్యక్షులు ఇర్రి రమణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కో ఆప్షన్ సభ్యుడు మసిర్ రెహాన్, కౌన్సిలర్లు జూకంటి లక్ష్మీశ్రీశైలం గుర్రం భూలక్ష్మి, వాంకుడోత్ అనిత, పేర్ని స్వరూప, పాక రమ, ఎండి సమ్మద్, ముస్త్యాల దయాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

8 నెలలుగా నిర్లక్ష్యం

- కోతకు గురైన రోడ్డు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్–ఉప్పుగల్లు మీదుగా స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. 8 నెలలు కావస్తున్నా సంబంధిత అధికారులు, పాలకులు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత వర్షాకాలంలో కురిసిన భారీ వానలకు కూనూర్, ఉప్పుగల్లు గ్రామాల మధ్య పెద్ద చెరువు మత్తడి సమీపంలో ప్రధాన రోడ్డు కోతకు గురైంది. దీంతో మూడు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఇదే రహదారిలో కూనూర్, గర్మిళ్లపల్లి గ్రామాల మధ్య కల్వర్టు సమీపాన కూడా రోడ్డు ఎత్తున కోతకు గురైంది. ఆ సమయంలో కూనూర్ నుంచి గర్మిళ్లపల్లి మీదుగా రహదారి విస్తరణ పనులు జరుతుండడంతో సంబంధిత కాంట్రాక్టర్ కోత కు గురైన చోట వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. కానీ కూనూర్, ఉప్పుగల్లు గ్రామాల మధ్య కోతకు గురైన రోడ్డు మాత్రం ఇప్పటికీ ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. ధ్వంసమైన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ రహదారి మీదుగా నిత్యం స్టేషన్‌ఘన్‌పూర్, కాజీపేట, హనుమకొండ, వరంగల్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్డు కోతకు గురైన చోట ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

మరమ్మతులు చేయండి



పెద్ద చెరువు సమీపాన రోడ్డు కోతకు గురైంది. 8 నెలలవుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ఈ రోడ్డుగుండా నిత్యం వాహనదారులు, ప్రయాణికులు వెళ్తుంటారు. కోతకు గురైన చోట ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో. అధికారులు పట్టించుకొని మరమ్మతు చేపట్టాలి.

– కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, కూనూర్

ఎవరూ పట్టించుకోవడం లేదు



కోతకు గురైన చోట రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు మరమ్మతు విషయంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. మళ్లీ వర్షాలు కురిస్తే రోడ్డు మరింత కోతకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును వెంటనే బాగు చేయాలి.

– మూల మహేష్‌గౌడ్, కూనూర్

ఎమ్మెల్యేపై కేసు నమోదు

జనగామ: గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నవంబర్ 30న ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. జనగామ మండలం శామీర్‌పేటలోని ఓ పోలింగ్ బూత్‌లోకి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పుకుని వెళ్లారని కాంగ్రెస్ యూత్ స్టేట్ లీడర్, ఎంపీ అభ్యర్థి తరపు పోలింగ్ ఏజెంట్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల సందర్భంగా ఉద్రిక్తతలు చోటు చేసుకునేలా వ్యవహరించినట్లు పేర్కొంటూ.. సంబంధించిన ఫొటో, ఇతర ఆధారాలను జత పరుస్తూ ప్రశాంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సృజన్ తెలిపారు.

చోరీకి గురైన బైక్ లభ్యం

లింగాలఘణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం నమిలే గ్రామంలో నెల రోజుల క్రితం చోరీకి గురైన బైక్ జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని చీటూరులో సోమవారం దొరికింది. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజపేట మండలం నమిలే గ్రామానికి చెందిన సత్తు సంపత్ బైక్‌ను ఇంటి ముందు నుంచి గత నెల 1వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. లింగాలఘణపురం మండలంలోని చీటూరులో రాగుల నరేందర్ అనే రైతు వ్యవసాయ బావి వద్ద సదరు బైక్‌ను వదిలి పెట్టిపోయారు. కొద్ది రోజులుగా గమనించిన సదరు వ్యక్తి బైక్‌పై ఉన్న మెకానిక్ స్టిక్కర్ ఫోన్ నంబర్‌కు కాల్ చేశాడు. కాగా, మెకానిక్ బైక్ పోగొట్టుకున్న సంపత్‌కు ఫోన్ చేయగా సోమవారం సదరు బైక్‌ను తీసుకెళ్లారు. రాజపేట పోలీసుస్టేషన్‌లో బైక్ చోరీపై కేసు నమోదైనట్లు సమాచారం.

చీటకోడూరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలి

జనగామ రూరల్: మండలంలోని చీటకోడూరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మరిగడి, చౌడారం, చీటకోడూర్ గ్రామస్తులు, యువకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు యాసారపు కర్నాకర్, సలేంద్ర కోమురయ్య, శ్రీనివాస్, మౌనిక, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పేరును మార్చవద్దని వినతి

పోరాడి సాధించుకున్న జనగామ జిల్లా పేరును మార్చకూడదని జాక్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మహేష్, సుభాష్, అశోక్, పవన్,సందీప్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బాధిత కుటుంబాలకు పరామర్శ

నర్మెట / బచ్చన్నపేట: మండలకేంద్రానికి చెందిన నిమ్మకంటి నర్సమ్మ (85), బచ్చన్నపేటకు కొన్నెకు చెందిన పసుల మల్లమ్మ (70) అనారోగ్యంతో మృతిచెందారు. కాగా, తెలంగాణా నాయీ బ్రాహ్మణ సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లెల్ల గణేష్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అభినాష్, కోశాధికారి అరిగెల శ్రీరాం, జూలూరి వేణు, బాలయ్య, బాపిరాజు, బుగులయ్య, సంపత్, కొన్నెలో కోడూరు శివ కుమార్ గౌడ్, పట్నం శెట్టి భద్రయ్య, పసుల శ్రీనివాస్ , యాట నరేష్, పులి రాములు బాధిత కుటుంబాలను సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులను అందజేశారు.


నిత్యావసరాలు అందజేస్తున్న సంఘం సభ్యులు

కళ్లెం పీఏసీఎస్ మాజీ చైర్మన్ మృతి

లింగాలఘణపురం: కళ్లెం పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఐలేని రాఘవరెడ్డి (57) సోమవారం గుండె పోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సొసైటీ చైర్మన్‌గా నిస్వార్థంగా రైతులకు ఎంతో సేవ చేశాడని, ప్రతి ఒక్కరితో గ్రామంలో ఆత్మీయంగా ఉండే రాఘవరెడ్డి మృతిపై పలువురు గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. అతనికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. అదేవిధంగా ప్రస్తుత చైర్మన్ బుషిగంపల ఉపేందర్, సొసైటీ సభ్యులు ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం


పల్లగుట్టలో లోలెవల్ కల్వర్టు రోడ్డు పక్కన ఉన్న బావి


వడ్డెగూడెంలో జనావాసాల మధ్య..

- రోడ్డు పక్కన బావులతో ఇబ్బంది

చిల్పూరు: మండలంలో పల్లగుట్ట రోడ్డులో రెండు, మండల కేంద్రం నుంచి వెంకటాద్రిపేటకు వెళ్లే దారిలో మూడు వ్యవసాయ బావులు నిత్యం వాహనాలు తిరిగే చోట ప్రమాదకరంగా ఉన్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ జాతీయ రహదారిలోని పల్లగుట్ట క్రాస్ నుంచి ఫత్తేపూర్‌కు వెళ్లే రోడ్డులో దేశాయితండా ఆర్ అండ్‌ఆర్ కాలనీ దాటాక లోలెవల్ కల్వర్టు పక్కనే ప్రమాదకంరంగా రోడ్డుకు అనుకుని బావి ఉంది. వర్షాలు కురిసినప్పుడు వాహన చోదకులు అక్కడకు చేరుకోగానే వాహనం అదుపుతప్పి ఎక్కడ అందులో పడిపోతుందోనని భయంతో వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. ఇక మండల కేంద్రం నుంచి వెంకటాద్రిపేటకు వెళ్లే రోడ్డులో మూడు బావులు జనావాసాల మధ్య ఉన్నాయి. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం ప్రజలు ఏదో ఒక పని మీద వెంకటాద్రిపేట క్రాస్ నుంచి వడ్డెగూడెం మీదుగా వెళ్తుంటారు. ఇక్కడ జానావాసాల మధ్య రోడ్డుకు సమీపంలో ప్రమాదకరంగా బావులు ఉన్నాయి. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించాలి.

– మునిపల్లి ప్రభాకర్, వాహన చోదకుడు

కల్వర్టు వద్ద రక్షణ ఏర్పాటు చేయాలి



ప్రతీ రోజు కృష్ణాజీగూడెం నుంచి ఘన్‌పూర్‌కు ఆటోలో ప్రయాణికులను తీసుకెళ్తాను. ఇదే రోడ్డులో లోలెవల్ కల్వర్టు పక్కనే ప్రమాదకరంగా వ్యవసాయ బావి ఉంది. దానికి ఎలాంటి రక్షణ గోడ లేదు. వర్షాకాలంలో ఇక్కడ నీరు నిలువడంతో ఎక్కడ ప్రమాదం జరగుతుందోనని భయంగా వెళ్తున్నాం. అధికారులు పట్టించుకోవాలి.

– సాదం భీమయ్య, ఆటో డ్రైవర్

రోడ్డు పక్క బావులున్న వారికి నోటీసులు ఇవ్వాలి



ప్రతీ రోజు పనులపై గ్రామాలు తిరుగుతా. రోడ్డు పక్కన ఎలాంటి రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా వ్యవసాయ బావులు ఉన్నాయి. రాత్రిళ్లు కొత్తగా వచ్చే వాహన చోదకులకు తెలియక ప్రమాదాలు జరగక ముందే బావుల యజమానులకు అధికారులు నోటీసులు ఇవ్వాలి.

– నిరంజన్, పల్లగుట్ట

అనుమతి ఉన్న విత్తనాలనే విక్రయించాలి

దేవరుప్పుల: ప్రభుత్వ నిబంధనల మేరకు ఎరువు దుకాణాల్లో అనుమతులు ఉన్న విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఎస్సై ఎస్ చెన్నకేశవులుతో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు స్టాకు, కంపెనీ, రిజిస్టర్ల నమోదును పరిశీలించారు. స్టాక్ బోర్డు పెట్టని దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేశారు. విధిగా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తగు వివరాలతో రశీదులు అందజేయాలన్నారు. నిర్దేశిత కంపెనీలను మార్కెట్‌లో డిమాండ్ చేస్తూ రైతులను దగా చేసే యజమానులకు చట్టపరంగా చర్యలు అనివార్యమని హెచ్చరించారు. ఏఈఓ సాగర్ తదితరులు ఉన్నారు.


మన గ్రోమోర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ, ఎస్సై

వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



జనగామ రూరల్: పట్టణానికి చెందిన పూరి నాగలక్ష్మి–వజ్రలింగం పెళ్లి రోజు సందర్భంగా సోమవారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుమారుడు భరత్ స్థానిక రైల్వే స్టేషన్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. నిరుపేదలకు ఒక్క పూట ఆకలి తీర్చడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి, టీం సభ్యులు సల్ల మహేష్, నర్సింహులు, రవి, సంపత్, బీం రాజ్, తదితరులు పాల్గొన్నారు.